# అత్తగారూ
# నీళ్ళబండి బసవయ్యా

తోటలో యిల్లు కట్టుకోవాలని తలచాం పట్టాంగాని మంచినీళ్ళ సంగతి ఆలోచించలేదు. తోటలో వున్న రెండుబావుల నీళ్ళూ, ఉప్పగాక పోయినా, చవదనీళ్ళు. పూలమొక్కల కోసం, వరిపంటకోసం రెండు పంపు సెట్లు పెట్టించుకున్నాము. నీళ్ళు చవదగానూ, మట్టిగానూ వుంటాయి.

మా అత్తగారి మడినీళ్ళు అవే అయినా మాకు ఆ నీళ్ళు తాగాలంటే గొంతు పట్టుకుంటుంది. ప్రతిరోజూ కారు యింటినుంచి ఎన్నిసార్లు బయటి కెళితే అన్నిసార్లు మా పాత యింటినుంచి, కుళాయి నీళ్ళు, రెండు పెద్ద డ్రమ్ముల్లో తెప్పిస్తూండేవాళ్ళం. ఏ రోజైనా డ్రైవర్ నీళ్ళడ్రమ్ములు కార్లో పెట్టడం మర్చిపోతే యిక ఆరోజు మాకు బావి నీళ్ళే శరణ్యం.

ఆ తెచ్చే రెండు డ్రమ్ముల నీళ్ళకూ మా తోటలో దొంగలుండే వాళ్ళు.... మా కాపలావాడి పెళ్లాం,మా తోటవాడి పెళ్ళాం.... యిద్దరూ చెరో రెండు బిందెలూ పుచ్చుకుని రెడీగా వుండేవాళ్లు. కారు వస్తూనే డ్రైవర్ని మంచి చేసుకుని గేటుదగ్గిరే కారాపి డ్రమ్ముల్లో వున్న నీళ్ళు బిందెల నిండా నింపుకుని కారు లోపలికి వదిలేవాళ్ళు.... నేను ఒకరోజు చూసి, మా అత్త గారికి తెలిస్తే గొడవవుతుందని మాట్లాడక వూరుకున్నాను. కాని డ్రమ్ముల్లో సగం నీళ్లు తగ్గడం చూసి మా అత్తగారు ఒకటి రెండుసార్లు అడిగారు- "ఏమిట్రా సగం నీళ్ళే తెస్తారు ... అంత పెట్రోలు ఖర్చుపెట్టి అంత దూరాన్నుంచి నీళ్ళు తెప్పిస్తుంటే యీవిధంగా సగం డ్రమ్ములు పట్టుకొస్తా రేమిట్రా" అని.

"లేదు పెద్దమ్మగారూ! డ్రమ్ముల నిండుగా నీళ్ళు పట్టుకొస్తే రోడ్లో గతుకులకి డ్రమ్ములు కులికి నీళ్ళు ఒలికిపోతాయి" అనేవాడు డ్రైవర్.

కాబోలు అనుకునేది మా అత్తగారు.... ఒక్కోసారి ఒట్టి ఖాళీ డ్రమ్ములు తెచ్చేవాడు. "ఏమిట్రా యిదీ, నీళ్ళేవీ" అంటే "అయ్యో పెద్దమ్మగారూ! ఏం జెప్పమంటారు? యీ లారీవాళ్లు కళ్ళు మూసుకొని తోల్తారు. లేచినోట మంచిది. లేకపోతే కారే వుండేదిగాదు. యిక నీళ్ళంటే.... షడన్‌గా కారు తిప్పేశాను. బండి పక్కనేవున్న పల్లంలోకి దిగింది.... డ్రమ్ములు దొర్లిపోయినయి" అంటూ డ్రైవర్ జరిగినదంతా యాక్షన్‌తో చెప్తూంటే మా అత్తగారు గుండె బాదుకుంటూ "హాపురా! హాపురా! ఎంతగండం తప్పింది! నీళ్ళు పోతే పోయినయ్. కారు దక్కింది" అనేవారు.

కాసేపటికి వెనకనుంచి మా పనిపిల్లవాడు (డ్రైవర్ విరోధి) వచ్చి నాకు చెప్పేవాడు అసలు విషయం.... "డ్రైవర్ వచ్చే దోవలో కారాపి ఆపవాళ్ళ దగ్గర బిందె అర్ధరూపాయి ప్రకారం నీళ్ళు అమ్ముతున్నాడమ్మగారూ" అంటూ.... "అంతేగాదు. ప్రతిరోజూ నీళ్ళకోసం ప్రొద్దుటే వెళ్ళినప్పుడు నేరుగా నీళ్ళు పట్టుకురాకుండా వాళ్ళ యింటికెళ్లి వాళ్ళ యిద్దరు పిల్లల్ని కార్లో ఎక్కించుకుని స్కూలు దగ్గిర దింపి తర్వాత నీళ్ళు పట్టుకొస్తాడమ్మా" అని కూడా చెప్పాడు. అందుకే అంత ఆలస్యం అవుతూంది రోజూ నీళ్ళు తేవడానికి.... యీ విషయం మా అత్తగారికి చెప్పడమా మానడమా!.... చెప్తే గొడవవుతుందని వూరుకున్నాను. యికమీద కార్లో మంచినీళ్లు తేనక్కర్లేదని చెప్పేశాను డ్రైవర్‌కి. "మరి ఎట్లాగే మీకునీళ్లా!" అన్నారు మా అత్తగారు....

"మీ అబ్బాయిగానీ, మీ మనవడుగానీ బయటి కెళ్ళొచ్చే కార్లో ఆ రెండు డ్రమ్ములూ పడేసి నీళ్ళు పట్టుకురమ్మంటే సరి....యిక మీద మనుషులు లేకుండా నీళ్ళకోసం కారు పంపకూడదు" అన్నాను.

"అవునే! నేనూ అదే అనుకున్నాను. ఎంత పెట్రోలు! ఎంతఖర్చు! ....మీరు నీళ్ళా తాగుతున్నారు! పెట్రోలు గదా తాగుతున్నారు," అంటూ వాళ్ళబ్బాయితో చెప్పేశారు. విధిగా ఆయన బయటికెళ్ళేప్పుడు కార్లో రెండు డ్రమ్ములూ పడేసి కెళ్ళి యింటికొచ్చేప్పుడు డ్రైవర్ చేత నీళ్ళు పట్టించుకు

రాగానే అవి. మనవాళ్ళకి అంటే చెప్పారు....కాలేజీకి వెళ్ళేప్పుడు [illegible] పట్టుకెళ్ళి యింటికొచ్చేప్పుడు నీళ్ళు పట్టించుకుని రావాలని. మావారు నవ్వుతూ ''అసలెందుకీ బాధంతా? సిమ్సన్ కంపెనీకి ఆర్డరిస్తే మామగారున్నప్పటి లాగే బండి ఒకటి తయారుచేసి యిస్తారు'' అన్నారు.

''అట్లాగా! మరి నాకేం తెలుసు యీ తబిసీళ్ళన్నీ, ముసల్దాన్ని. మంచిది అర్డరిప్పు. అయితే ఆ బండి కో బసవయ్య కావలెగా'' అన్నారు మా అత్తగారు.

"బసవయ్యేవరమ్మా" అన్నారు, మావారికి అర్థంగాక.

''ఎద్దురా! బండికి ఎద్దుకావద్దూ!....''

''ఓహో! మన దగ్గిరున్నట్లున్నయే ఒకటో, రెండో ఎద్దులు!....''

''అవి ఆవుల్రా. ఎద్దులుగావు'' అంటూ పడీపడీ నవ్వారు మా అత్తగారు....

''ఏమో! నాకేం తెలుసీ గొడవ? బండి రెడీ చేయించడం వరకూ నా వంతు" అంటూ తప్పుకున్నారు.

''అయితే ఎద్దును కొనడం మా వంతట్రా! సరే మన మేనేజర్ని పంపు. రేపు శుక్రవారం పల్లావరం సంతకెళ్ళి ఒక ఎద్దును తోలుకురమ్మంటాను....'' అన్నారు మా అత్తగారు....

శుక్రవారంనాడు మేనేజరు పల్లావరం సంతకు బయల్దేరాడు. ఎద్దును కొనే 'బడ్జట్' నూటయాభై రూపాయలన్నారు మా అత్తగారు.... మేనేజరు యిబ్బందిలో పడ్డాడు. ''ఒకవేళ పాతిక రూపాయలు అటూ యిటూ అయితే ఫర్వాలేదా''అని నన్నడిగాడు, మా అత్తగారు వినకుండా.... ఫర్వా వుండదని చెప్పాను....

సాయంకాలానికి మేనేజరు తిరిగి వచ్చాడు....''ఎద్దెక్కడా''అన్నారు మా అత్తగారు. మేనేజరు జేబులు వెతుకుతూ....వెలవెలబోతూ ''నేను బస్సులో వచ్చాను....ఎద్దును రేపు తోలుకొస్తారు....అదీకూడా, మనకు రేపు ప్రొద్దుటే టెలిఫోన్ చేసి, తోలుకొస్తారు. మిమ్మల్ని అడక్కుండా

ఎట్లా తోలుకురమ్మనేది.... ఎద్దు మాత్రం చాలా మంచిది. సంఘపు మా నీళ్ళబండికి సరిగ్గా వుంటుంది."

"అందుకే గదయ్యా నిన్ను సంతకు పంపిందీ.... అక్కడ మంచి గొడ్లు దొరుకుతాయి."

"యిది సంతలో దొరికిన గొడ్డుగాదండీ! సంతలో అన్నీ నాసిరకం గొడ్లున్నాయి. ఒక్కఎద్దుకూ బండిలాగే ఓపికలేదు ఒత్తి ఎముకల గూళ్ళతో వున్నాయి గొడ్లన్నీ.... కొన్నయితే మరీ చిన్నదూడల్లా వున్నాయి. అక్కడొక ముసలాయన్ని విచారిస్తే తన దగ్గర మంచి ఎద్దు వుందన్నాడు, పక్కనే వున్న పల్లెటూళ్ళో.... సరేసరే, చూపించమన్నాను ఎద్దును.... 'చూడక్కర్లేదు, మైసూరు బసవేశ్వరుడిలా వుంటుంది ఎద్దు. అందానికి అందంవుంది. పరమసాధువు. ఎంతిస్తారు డబ్బు' అన్నాడు, నూటయాభై రూపాయలన్నాను.... మూడు వందల రూపాయలిస్తే ఇస్తానన్నాడు. చివరకు బేరం చేసి రెండువందలా యాభైకి ఒప్పించాను" అన్నాడు మా అత్తగారి రియాక్షన్ కనిపెడుతూ. ఆ మాట విన్న మా అత్తగారు తుళ్ళిపడి,

"రెండువందలాయాభయ్యే! నీకేమన్నా మతిపోయిందటయ్యా! నీళ్ళ బండి లాగే ఎద్దును రెండువందలాయాభైకి కొంటారా ఎవరన్నా...."

"అవునండీ, నూటయాభైలో మంచి ఎద్దు రాదన్నారు అక్కడి వాళ్ళంతా."

"అక్కడి వాళ్ళంతా అంటే అన్నార్లే...ఇక్కడి వాళ్లు వుందన్నారు.. మన పాలవాడికి తెలిసినవాళ్ళదగ్గిర ఏదో మంచిఎద్దు వుందట. నూటయాభై కే యిస్తారట. తోలుకు రమ్మని చెప్తాను. ఆ పల్లావరం ఎద్దు అంత ఖరీదు పెట్టి కొనడం నా కిష్టంలేదు" అన్నారు మా అత్తగారు. పాపం! మేనేజరు చిన్న బుచ్చుకున్నాడు "....సరేనండి, అలాగే. రేపుప్రొద్దుటే వాళ్లు ఫోన్ చేస్తారు. మన నెంబరిచ్చి వచ్చాను. ఒద్దని చెప్పే సెయ్యొచ్చు" అన్నాడు.

"అడ్వాన్సేమైనా యిచ్చావా" అన్నారు, మా అత్తగారు, మేనేజర్ని కొరకొర చూస్తూ.

"లేదండీ. ఒక్క రూపాయి యిచ్చివచ్చాను, శాస్త్రానికి" అన్నాడు.

"ఒక్క రూపాయేగా! పోతే పోయింది" అన్నారు మా అత్తగారు, చప్పరిస్తూ.

ప్రొద్దుటె మా అత్తగారు పాలవాడు చెప్పిన ఎద్దు కోసం ఎదురు చూట్టం మొదలెట్టారు.

పల్లెపురంనుంచి ఫోనొచ్చింది: 'ఎద్దును తోలుకు రమ్మంటారా' అని. నేను ఒక్క క్షణం ఆలోచించి, 'యీరోజు మంచిది కాదు. రేపు ప్రొద్దుటే మళ్ళీ ఒకసారి ఫోన్ చేసి తోలుకురమ్మని' చెప్పాను, మా అత్తగారు వినకుండా.

పాలవాడు చెప్పిన ఎద్దును తోలుకొచ్చారు. ఆ ఎద్దును అయిదుమంది పట్టుకొచ్చారు, తలనిండా తాళ్ళుకట్టి. బ్రహ్మాండమైన ఎద్దు. వంకర్లు తిరిగిన పెద్దకొమ్ములతో, తలవూపుతూ, పట్టుకున్న వాళ్ళచేతుల్లో నిలవకుండా చిందులు తొక్కుతూన్న అంత పెద్ద ఎద్దును చూసి మా అత్తగారు నిర్ఘాంత పడిపోయారు.

'అంత పెద్ద ఎద్దు ఎందుకు నీళ్ళబండికి' అంటారనుకున్నాను. కాని తక్షణం మా అత్తగారి పెదాలమీద చిరునవ్వు కనిపించింది. ఏదో ఆమెకు లాభం వస్తేనే అటువంటి చిరునవ్వు కనిపిస్తుంది.... నన్ను దగ్గిరికి రమ్మని సైగచేశారు.... నా చెవులో చెప్పారు. 'ఎద్దు గొప్పది.... యింత పెద్ద ఎద్దు నూటయాభైరూపాయలకు దొరకడం చాలా అదృష్టం అనుకోవాలి.... ఏమంటావు' అన్నారు.... నిజమే. అంత తక్కువ ఖరీదుకు దొరికే ఎద్దుగా కనిపించ లేదు. కాని ఎందుకు దొరుకుతూందో, దానిలో ఏం లోపంవుందో అనే అనుమానం కలిగింది. అంతమంది మనుషులు దాన్ని పట్టుకోడం, ఎద్దు ఒక చోట నిలవకుండా తలవిసుర్తూ చిందులు తొక్కడంచూస్తే నా అనుమానం ఎక్కువైంది. మా అత్తగారితో చెప్పాను. ఆమె అలక్ష్యంగా చప్పరించి "యివన్నీ యీ ఎద్దుల్ని అమ్మేవాళ్ళ ట్రిక్కులే.... నాకు తెలీవనుకొంటారు వెధవలు.... ఎద్దు చాల గొప్పది అని తెలియజేయడంకోసం అంత హంగామా.

దారినపోయేవాళ్ళ నెవర్నో కాస్త ఎద్దును పట్టుకు రమ్మని వుంటారు.... అంతా నాటకం" అన్నారు. కాబోలు ననుకున్నాను.

"ఎద్దును అంతమంది పట్టుకుంటేే ఎట్లారా, బండికి కట్టి చూడండి" అన్నారు మా అత్తగారు. బండి తెచ్చి కట్టారు. బండిమీద రెండుగజాల ఎత్తున్నది ఎద్దు. మా బండివాడు పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వడం మొద లెట్టాడు.... యింకా ఎద్దును అయిదుగురు పట్టుకోడం చూసి, "యింకా మీరంతా ఎందుకర్రా, ఎద్దును పట్టుకుంటారు! ఒదిలేయండి.... మాబండివాడు తోలిచూడాలి'' అన్నారు మా అత్తగారు.

"బాబోయ్! పెద్దమ్మగారూ, పిల్లామేకాగలోణ్ని, నేతోల్ను" అన్నాడు మా బండివాడు.

ఎద్దును పట్టుకున్న అయిదుగురూ ఒకరి ముఖాలు ఒకరు చూసు కున్నారు. ముందు వైపు పట్టుకున్న యిద్దరూ ఎద్దును వదిలేశారు. తక్షణం ఎద్దు ఒక్క విదిలింపుతో వెనక వాళ్ళను కిందికి తోసి, బండితో సహా క్రిష్ణ లీలల్లో రాక్షసుడిలా మాయమైంది. "ఆ.... "అంటూ అందరం నిర్ఘాంతపోయి ఎద్దుకోసం వెనక పరిగెడుతున్నవాళ్ళను చూస్తూ వుండిపోయాం....

అప్పుడే వచ్చిన మేనేజరు చెట్టు వెనుకనుంచి వచ్చాడు మెల్లిగా.... మా అత్తగారు అతని ముఖం చూశ్కేక అపస్థపడ్డారు....

"చాలా పోకిరీ ఎద్దు....అబ్బా! ఎంత పెద్ద ఎద్దండి" అన్నాడు హడలెత్తిపోయిన మేనేజరు.

"మరి ఆ పల్లావరం ఎద్దును తోలుకురమ్మని చెప్దామా" అన్నాను:

"ఆ మరి ఏదో కావాలిగా బండికి!.... దొంగవెధవలు.... ఏదో మంచి ఎద్దు తెస్తారుగదా అనుకున్నాను'' అని సణుక్కుంటూ లోపలి కెళ్లారు....

మర్నాడే నీళ్ళబండి బసవయ్య వచ్చాడు. పల్లావరంనుంచీ.... బస వయ్య ముఖంలో కళ, అణుకువ, ఓర్పు, గంభీరం-ఒక టేమిటి!అన్నిమంచి లక్షణాలూ కనిపించాయి.... అన్ని సుగుణాలూ మూర్తీభవించిన బసవయ్య బండికి సరిపోయాడు. బండి లాగించి ట్రైల్ చూశారు.... యీ మహా సంసా రాన్ని లాక్కెళ్తున్న భగవంతుడిలా ఆ బండిని నెమ్మదిగా, హుందాగా

లాక్కెళుతున్న బసవయ్య అందరి మన్ననలకూ పాత్రుడయ్యాడు....బండి వాడు బసవయ్యను ముద్దుపెట్టుకుని దిష్టితీశాడు.

రోజూ బండివాడు బసవయ్య సుగుణాలను మెచ్చుకుంటూ, ఒక్క దెబ్బ తినకుండా నిష్ఠతో నీళ్ళబండి లాక్కొస్తున్నట్లు చెప్పాడు.

మా అత్తగారికి బసవయ్యంటే చాలా అభిమానం ఏర్పడ్డది. తనే స్వయంగా, తెలగపిండీ, పొట్టూ వగైరా తినిపించేది బసవయ్యచేత.... రెండుపూటలా ఉలవపిండి పెట్టించేది....బసవయ్య అన్నీ తాపీగా పుచ్చుకుంటూ, బండి కట్టే వేళకు తనంతట తానే వచ్చి బండి దగ్గిర నిలబడేవాడు. ''ఆహా! ఆహా! యిది ఎద్దుగాదే!....యిది మనిషిగాదు....మనుషుల కింత జ్ఞానం ఎక్కడిది....కేవలం పూర్వజన్మలో మహర్షి మన బసవయ్య....'' అంటూ మా అత్తగారు బసవయ్యను మెచ్చుకునేవారు....

వున్నట్లుండి మా బండివాడు 'తల్లి పోయిం'దని సడన్‌గా వాళ్ళ వూరు వెళ్ళిపోయాడు. వాడు వెళుతూ ఎవర్నో తెలిసినవాడిని బండి నీళ్ళు తేవడానికీ, తోటపనికీ పెట్టి వెళ్ళిపోయాడు.

ఆ కొత్తవాడు మా అత్తగారికి నచ్చలా. వాడు జట్కావాడు కావడం, బీడీలు తాగడం, వాడి ప్రవర్తన చూసి "పెద్దొత్తి రౌడీవెధవే" అన్నారు మా అత్తగారు.

కొత్తవాడు మా అత్తగారికే కాకుండా మా బసవయ్యకు కూడా నచ్చలేదు....మొదటిరోజు బండి కడుతూనే ఒక్క చరుపు చరిచాడు. బసవయ్యకు ఓర్పెక్కువ గనక తమాయించుకున్నాడు. కొత్తవాడికి అడ్రసు తెలదని మా పాత యింటి అడ్రసు రాసి బండివాడి చేతికిచ్చారు. బండివాడు ఎవర్నీ అడిగే అవసరం లేకుండానే నేరుగా బండిని మా పాత యింటికి తీసుకెళ్ళాడు బసవయ్య. అందుకే, ''అది ఎద్దుగాదే! మహర్షి—'' అన్నారు మా అత్తగారు.

వచ్చిన రెండోరోజు నీళ్ళకు పోయిన కొత్త బండివాడు సాయంకాలం నాలుగు గంటలయినా రాకపోవడం చూసి, ''ఏమిటి! యీ కొత్త వెధవ బండినీ, బసవయ్యనూ యింకా తీసుకురాలేదే'' అంటూ మా అత్తగారు ఆదుర్దాపట్టం మొదలెట్టారు.

సాయంత్రం ఆరుగంటలకు తోలుకొచ్చాడు బండిని, తూలుతూ....

ఆ రాత్రి భోజనానికి కూర్చోబోతున్న మా అత్తగారు వెండి కంచం, చెంబూ, గ్లాసూ కనిపించడం లేదని ఖంగారు పడుతూ, వంటవాడూ తనూ వెదకడం మొదలెట్టారు....ఎక్కడా కనిపించకపోవడంతో కొత్త బండివాడిని అనుమానించారు....''ప్రొద్దుటే బసవయ్యకు తెలగపిండీ, ఉలవపిండీ కావాలని వంటింటి వేపు వచ్చాడు....అందరం హాల్లో వున్నప్పుడు వాడు వెనక తారట్లాడుతూ వుండడం చూశానే....పోనీ వాడిని పోలీసులకు పట్టిస్తే'' అన్నారు. ''ఒకవేళ వాడు తీయకపోతేనో'' అన్నారు మిగతా వాళ్ళు....

ఏంచేయాలో తోచక మా అత్తగారు ఆ వెండికంచాన్నీ, చెంబునూ వర్ణిస్తూ, అవి రెండూ తనకు చేసిన సేవనూ, ఆ వెండియొక్క ఔన్నత్యాన్నీ ఆ వెండి ఎన్ని పాత వెండిపాత్రల నుండి గ్రహించబడ్డదీ, ఆ పాత్రలన్నీ ఏనాటివో, ఎట్లాంటి సందర్భాల్లో చేయించబడ్డవో, అవన్నీ కరిగించి చివరకు కంచం, చెంబూ తయారు చేయించాననీ వాటి హిస్టరీ చెబుతూ కంట తడిబెట్టారు ...''పోనీ లేమ్మా, యింకో చెంబూ కంచం చేయించుకోవచ్చులే'' అని కొడుకు ఓదార్చినా, ఆ కంచం చెంబూ గొప్పతనం, వాటిలో వుండే వెండి యొక్క 'క్వాలిటీ' రాదని చెప్పి బాధపడ్డారు.

ఆ సమయంలోనే మా పాత బండివాడు వచ్చాడు. వాడిని చూస్తూనే మా అత్తగారి ప్రాణం లేచొచ్చింది....జరిగిందంతా వాడికి ఒక్కక్షణంలో చెప్పి తన అనుమానం ఇంకా ఆ కొత్త బండివాడి మీదే వుందన్నారు. వాడు కూడా సందేహిస్తూ ''నేను నెమ్మదిగా కనుక్కుంటా నమ్మగారూ! మీరు దిగులు పడకండి....'' అంటూ మా అత్తగారికి హామీ యిచ్చాడు.

మర్నాడు కొత్తవాడిని తోటపని చూస్తూండమని చెప్పి పాత బండివాడు బసవయ్యకు ప్రేమగా తిండిపెట్టి, నీళ్ళు తాగించి, బండికట్టి తీసుకెళ్ళాడు.

పాతవాడు మామూలుగా వచ్చే టైమ్‌కు రాలేదు.... 'వీడికి ఏమొచ్చిందో తెగులు' అని సణుక్కుంటూ, 'నాకంచం, చెంబూ ఏమయినాయో' అంటూ కలవరిస్తూ కూర్చున్నారు మా అత్తగారు ....

గేట్లో బసవయ్య మెళ్ళో గంటల చప్పుడు వినిపించింది. మరుక్షణం, మా పాత బండివాడు, 'పెద్దమ్మగారూ పెద్దమ్మగారూ' అంటూ పరుగెత్తుకుంటూ లోపలికొచ్చాడు. "ఏమిట్రా! ఏమైంది" .... అంటూ మా అత్తగారు ఎదురెళ్ళారు.... వాడు సంతోషంతో ఉక్కిరిబిక్కిరై, మాటలు రాక అవస్థపడి, "మీవెండి కంచం, చెంబూ దొరికినయ్ అమ్మగారూ...." అంటూ చేతిలో వున్న పాత గుడ్డల మూట విప్పి చెంబూ, కంచం బయటికి తీశాడు.... మా అత్తగారు సంతోషంతో పొంగిపోయి, బండివాడిని ఎంతో మెచ్చుకుంటూ, పందేళ్ళు బ్రతకమని దీవించారు. ఆనంద బాష్పాలను తుడుచుకుంటూ, వాడు 'ఆ దీవెనలన్నీ బసవయ్యకి చెందుతా' యన్నాడు.

"బసవయ్యకెట్లా చెందుతాయిరా" అని అడిగారు మా అత్తగారు.

"మన బసవయ్య ఎద్దుగాదు పెద్దమ్మగారూ! నిజంగా అది బసవేశ్వరుడే.... మనం అంతా మొక్కాల్సిన నందీశ్వరుడు మన బసవయ్య.... బసవయ్యే లేకపోతే మీ కంచం, చెంబూ దొరికేయి కావు."

"ఎట్టాగా?"

"అవునమ్మగారూ! నేను యీడ నుంచి బండి కట్టుకొని వెళ్ళాను గదండీ! నేను ఎప్పుడూ నేరుగా మన పాతింటి కెళ్ళి నీళ్ళు తీసుకొని ఎక్కడా ఆక్కుండా యింటి కొస్తానండి. అదీ అలవాటు.... యీ రోజు పోతూవుంటే షడన్‌గా ఒక బీడీ దుకాణం ముందు ఆగాడండీ బసవయ్య. నాకు ఆశ్చర్యం వేసి 'ఏందిరా యిదీ? బసవయ్య యిక్కడెందుకాగాడు' అనుకుంటూవుంటే, ఆ కొట్టోడు నన్ను చూసి నవ్వి 'ఎద్దు బలే తెలివైందే! నువ్వు లేనప్పు డొచ్చిన బండోడు నా కొట్లో బీడీలు కొనుక్కునేవాడులే. అందు కాగింది అన్నాడు ....' బసవయ్య బుద్ధిశాలితనాన్ని ఏం మెచ్చుకొనే దమ్మగారూ! మళ్ళీ బయల్దేరాను. నేరుగా రోడ్లో బోయేదల్లా షడన్‌గా మలుపు దిరిగి ఒక సందులోకి బండిని లాక్కుపోయింది .... నేను ఎంత మళ్ళించాలని చూసినా నావల్ల గాలా. పక్కన-మురిక్కాలవ పక్కన చిన్న చిన్న గుడిసెలు. ఆ సందులో బండి ఎళ్ళడమే కష్టం. 'ఎందుకు బసవయ్యా యిటెడుతున్నా'వని నేను అడుగుతుండంగానే వో గుడిసె ముందాగాడు

బసవయ్య. కిళ్ళీ కొట్టుకాడ ఆగినట్టాగిందే అని అనుమానం గలిగింది .... బండి సప్పుడిని లోపల్నించి వో పడుసు పిల్ల పరుగెత్తుకొచ్చి 'ఎవరయ్యో నువ్వు! మామ రాలేదా!'—అంది.... వోహో అనుకున్నా.... బండిదిగి గబ గబా లోపలి కెళ్లా....నా కనుమానం ఎక్కువైంది....'ఒక పాశికేసి చూద్దాం పార్తుందేమో' అనికొని 'చూడమ్మాయ్ .... మీ మామ శానా యిబ్బందిలో వుండాడు....వాడేమన్నా మీ దగ్గిర దాచిపెట్టమని యిచ్చాడా!' అన్నా. రహస్యంగా దాని చెవు దగ్గరకెళ్ళి... మొదట బిత్తరచూపుల్తో తటపటాయించి, తర్వాత అవునని తలూపింది....రొట్టెకగి నేతిలో పడ్డాదని ఆ పిల్ల తల్లికాడ చెప్పా-'వాడిని పోలీసులు వెతుకుతున్నారు. పట్టుకుంటే ఆడిచ్చిన వస్తువులు మీ యింట్లో వున్నయ్యని చెప్తాడు. పోలీసులు మీ గుడిసెమీద పడతారు కాసేపట్లో' అని ....

"ఆ ముసల్ది 'బాబోయ్' అని పెద్ద కేకేసి నా రెండుచేతులూ పట్టుకుని 'చూడు బాబూ! ఆ ముదనష్టపోడు ఒక ఎండి కంచం, చెంబూ తెచ్చి నాకిచ్చి దాసి పెట్టమన్నాడు .. నా పిల్లని పెళ్ళి చేసుకుంటానన్నాడు గదా అని బుద్ధి గడ్డితిని దాచిపెట్టా....యిదిగో అట్లనే పెట్టిలో పెట్టా....'అంటూ యీ మూట తెచ్చి నా చేతికిచ్చి, అది వాడిచేతికే యిచ్చెయ్యమనీ, పోలీసుల కీ సంగతి చెప్పొద్దనీ బతిమాలింది....చెప్పనని చెప్పి ఆ మూట తీసుకొని అదే రావడం— నీకుగూడా తేలా పెద్దమ్మగారూ...."అని వాడు చెప్తూంటే—

"హవురా! హవురా!! ఎంతపని, ఏంసంగతి! ఆ జట్కా వెధవ ఒట్టి దొంగ వెధవని నాకు వాడు వచ్చిన రోజే తెలిసిపోయింది. ఏడీ! నా బసవయ్య! నా మహర్షి ఎక్కడ" అంటూ గబగబ బయటి కొచ్చి బండి కట్టివున్న బసవయ్యను పొగడ్తల్తో ముంచెత్తారు.... దీర్ఘాయుష్షుతో వుండమని దీవించారు....

ఆ రోజు బసవయ్యకు గొప్ప విందు చేశారు. బసవయ్య తిండి కొంత మేమూ తిన్నాం....... ఆ రోజు నుంచీ మానీళ్ళబండి బసవయ్యకు మా యింట్లో చాలా గొప్ప స్థానం యివ్వబడ్డది....బండివాడు మారినప్పుడు పొరపాటున కూడా ఏ కొట్టు దగ్గిరా బండి ఆపేవాళ్ళుకాదు...బసవయ్యంటే బండివాళ్ళకు హడల్....